భానుడి భగభగలు

జన సంచారం తగ్గి వెలవెలబోతున్న కోరుట్ల కార్గిల్ చౌరస్తా

నిర్మానుష్యంగా మారిన కోరుట్ల ప్రధాన జాతీయ రహదారి..

కోరుట్ల పట్టణంలో శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 41 డిగ్రీల సెల్సియస్ టెంపరేచర్ రికార్డు కావడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పట్టణంలో జన సంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే కొత్త బస్టాండ్, కార్గిల్ చౌరస్తా, కల్లూరు రోడ్డు, ఇందిరా రోడ్డు, వేములవాడ రోడ్డు బోసిపోయాయి. – కోరుట్ల, ఏప్రిల్ 5

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల/మెట్‌పల్లి, ఏప్రిల్ 5: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. శుక్రవారం కోరుట్లలోని అంబేద్కర్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్‌రామ్ దళిత కుటుంబంలో జన్మించి చైతన్యవంతమైన నాయకత్వంతో ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన జీవితం ఆదర్శప్రాయమని, దళితుల హక్కుల సాధన, అంటరానితనం నిర్మూలనకు అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో విగ్రహ కమిటీ అధ్యక్షుడు పేట భాస్కర్, ప్రధాన కార్యదర్శి లచ్చయ్య, నాయకులు శనిగరపు రాజేశ్, ఉయ్యాల నర్సయ్య, రాజశేఖర్, శోభన్, ప్రభాకర్, రాజమౌళి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కోరుట్ల, ఏప్రిల్ 5: పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ 34వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చన జరిపించారు. వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

అంగన్‌వాడీల రిటైర్మెంట్ జీవోను రద్దు చేయాలి

కోరుట్ల, ఏప్రిల్ 5: అంగన్‌వాడీల రిటైర్మెంట్ జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి డిమాండ్ చేశారు.శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవోలో అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ. లక్ష, ఆయాలకు రూ.50 వేలురిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ప్రకటించడం దురదృష్టకరమన్నారు. 40 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్న అంగన్‌వాడీలను వృద్ధాప్యంలో చిన్నచూపు చూడడం తగదన్నారు. టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతినెల రూ. 5 వేల పెన్షన్ అందించాలని పేర్కొన్నారు.

ధర్మపురి వాసికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ విజయవంతం

- న్యూరోసర్జరీలో మైలురాయిని సాధించిన యశోద హాస్పిటల్

మాట్లాడుతున్న యశోద హాస్పిటల్ నిర్వాహకులు

జగిత్యాల, ఏప్రిల్ 5: ధర్మపురికి చెందిన ఓ యువకుడికి చేసిన బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ విజయవంతమైంది. సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో డాక్టర్ కేఎస్ కిరణ్, అతడి బృందం మెదడులో కణితి విచ్ఛేదనను విజయవంతంగా అమలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన ఇరవై ఏండ్ల అభినయ్‌కు గత నెల 31న శస్త్రచికిత్స చేశారు. మెదడులో ఫోసా మెనింగియోమా సైనస్ ఆక్రమించింది. దీంతో మెదడులోని కణితిని సున్నితంగా తొలగించడానికి శస్త్ర చికిత్స బృందం అత్యాధునిక ఇంట్రా ఆపరేటివ్ నర్వ్ మానిటరింగ్, న్యూరో నావిగేషన్ టెక్నాలజీని ఉపయోగించడంతో ఆపరేషన్ విజయవంతమైంది. యశోద హాస్పిటల్ ప్రతినిధి మాట్లాడుతూ.. నైపుణ్యం, సాంకేతికత, కారుణ్య సంరక్షత, నిరంతర ఆవిష్కరణలపై తమ దవాఖాన దృష్టి సారించి, ఆరోగ్య సంరక్షణ రంగంలో నూతన ఒరవడిలను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మందలింపే.. మరణశాసనమైంది

- పని చేయాలన్నందుకు తండ్రిని హతమార్చిన తనయుడు
- మల్లాపూర్‌లో ఘటన

అంబదాస్ (ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 5: జల్సాలు మాని, ఏదైనా పని చేయాలని తరచూగా మందలిస్తుండడంతో కోపం పెంచుకున్న కొడుకు, తండ్రిని హత్య చేసిన ఘటన మల్లాపూర్‌లోని దుర్గమ్మ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం... హుస్నాబాద్‌కు చెందిన అంబదాస్(54) పదిహేనేండ్ల క్రితం మండలంలోని కుస్తాపూర్‌కు చెందిన కండెల బోజవ్వను వివాహం చేసుకున్నాడు. బోజవ్వకు సైతం రెండో వివాహం కావడంతో అంతకు ముందు ఉన్న భర్త ద్వారా కుమారుడు కండెల రవితేజ(21) ఉన్నాడు. వీరందరూ కొన్నేండ్ల నుంచి మల్లాపూర్‌లోని దుర్గమ్మకాలనీలో ఉంటున్నారు. అంబదాస్ ఓ కిరాణా దుకాణంలో, బోజవ్వ ఓ హాస్టల్‌లో పని చేస్తున్నారు. కాగా కొద్ది రోజులుగా తండ్రి అంబదాస్, కుమారుడు రవితేజను జల్సాలు మాని, ఏదైనా పని చేయాలని తరచూగా మందలిస్తున్నాడు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అంబదాస్‌ను కుమారుడు రవితేజ పదునైన ఆయుధంతో మెడపై నరికి హత్య చేశాడు. అనంతరం రవితేజ పరారయ్యాడు. ఘటనా స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరావు పరిశీలించారు. ఆయన వెంట సీఐ నవీన్, ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

జగిత్యాల: కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

జగిత్యాల/సారంగాపూర్/మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్/కోరుట్ల/కొడిమ్యాల/కోరుట్ల రూరల్/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి/వెల్గటూర్, ఏప్రిల్ 5: బాబూ జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా యువతకు సూచించారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ రాజ్యాంగ నిర్మాణంలో ముఖ్య పాత్రను పోషించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడిన జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ వందన సమర్పణ చేశారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, అదనపు ఎస్పీ వినోద్‌కుమార్, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, నివాళులర్పించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాంచందర్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శోభన్, పెగడపల్లిలో కాంగ్రెస్ నాయకులు, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం, కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ మోహన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, కోరుట్లలోని సీ ప్రభాకర్ గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం, సభ్యులు, కొడిమ్యాలలో దళిత సంఘ నాయకులు, మెట్‌పల్లిలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం భవనంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి శంకర్, కోరుట్లలోని అంబేద్కర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు, కోరుట్ల రూరల్ మండలం చిన్నమెట్‌పల్లిలో మాదిగ కుల సంఘ సభ్యులు, ఇబ్రహీంపట్నంలో మాదిగ యువజన సంఘం, బీమారంలో, వెల్గటూర్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద దళిత సంఘాల నాయకులు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యేను పరామర్శించనున్న కేటీఆర్

జగిత్యాల, ఏప్రిల్ 5: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తండ్రి హన్మంతరావు ఇటీవల మృతి చెందారు. కాగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శనివారం ఉదయం జిల్లా కేంద్రానికి రానున్నారు.

నంబర్ ప్లేట్లు లేని బైక్‌లు సీజ్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో నంబర్ ప్లేట్లు లేని బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వెల్లుల్ల శివారులో 15 వాహనాలను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు పేర్కొన్నారు. వాహనాలకు తప్పనిసరిగా నంబరు ప్లేట్లు బిగించుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మామిడి తోట దగ్ధం

కథలాపూర్, ఏప్రిల్ 5: సిరికొండ గ్రామ శివారులో 33/11 కేవీ విద్యుత్ తీగలు తెగి మంటలు అంటుకోగా మామిడి తోట దగ్ధమైనట్లు బాధిత రైతు ఉరుమడ్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం తీగలు తెగి కిందపడడంతో అక్కడే ఉన్న ముప్పై మామిడి చెట్లకు మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో 5 టన్నుల మామిడికాయలు నష్టపోయినట్లు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

తెలంగాణను దోచుకుంటున్న కాంగ్రెస్

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో దొరికింది దొరికినట్లు దోచుకుంటున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రైతు సత్యాగ్రహ దీక్షలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగు నీరు అందక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, రైతులను పట్టించుకోని చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అని మండిపడ్డారు. రైతులను నడిరోడ్డుపై పడేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వందే అన్నారు. రైతు ప్రభుత్వం వస్తది అనుకుంటే రజాకార్ల ప్రభుత్వం వచ్చిందని వాపోయారు. డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసి, క్వింటాల్‌కు రూ. 500 బోనస్, కౌలు రైతులకు రూ.12 వేలు, రైతు బంధు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. పంట బీమా లేని ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. పంట బీమాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు.

కాగితాల్లోనే పసుపు బోర్డు ఏర్పాటు

- చక్కర కర్మాగారం తెరిపించారా..?
- ప్రజలకు ఏం చేశారని ఓట్లు అడుగుతున్నారు
- బీజేపీ నాయకులను ప్రశ్నించిన ప్రభుత్వ విప్ అడ్లురి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 5: 'కాగితాల్లోనే పసుపు బోర్డు ఏర్పాటైంది తప్పా బీజేపీతో రైతులకు ఒరిగిందేమీ లేదు.. చక్కెర కర్మాగారం తెరిపించారా..? మీరు ఏం చేశారని ప్రజలను ఓట్లు అడుగుతున్నారు' అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లురి లక్ష్మణ్‌కుమార్ బీజేపీ నాయకులను నిలదీశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శుక్రవారం ప్రభుత్వ విప్ విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రైతులకు ఏం చేసిందని ప్రశ్నించారు. చక్కెర కర్మాగారం ఎందుకు పునః ప్రారంభించలేదన్నారు. అరవింద్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి చూపి ఓట్లు అడగాలన్నారు. కాగితాల్లోనే పసుపు బోర్డు చూపెడుతూ ఓట్లు అడగడం ఆయన చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఢిల్లీ సరిహద్దుల్లో నల్లచట్టాలను ఉపసంహరించాలని రైతులు ధర్నా చేస్తే, మోదీ 750 మంది రైతులను పొట్టన బెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సినీ ఫక్కీలో చోరీలు

- పోలీసులమని చెప్పి గొలుసు అపహరణ
- ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగు నుంచి నగలు మాయం

బంగారు నగలు పోయాయని బస్టాండ్‌లో రోధిస్తున్న బాధిత మహిళ

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 5: సినీ ఫక్కీలో జగిత్యాలలో శుక్రవారం రెండు చోరీలు జరిగాయి. ఐడీ పార్టీ పోలీసుల మంటూ ఓ వ్యక్తికి సాయం చేసినట్టు నటించి రెండు తులాల బంగారు గొలుసు, ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ఓ మహిళ బ్యాగులోంచి 15 తులాల బంగారు నగలను దొంగలు తస్కరించారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన చంద్రమౌళి పట్టణంలోని టవర్ సర్కిల్ నుంచి బీరయ్యగుడి సమీపంలో ఉన్న ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఐడీ పార్టీ పోలీసులమంటూ ఇద్దరు వ్యక్తులు చంద్రమౌళి వాహనాన్ని ఆపారు. ఇది ఎన్నికల సమయమని, వంటిపై ఎక్కువ మొత్తంలో బంగారు నగలు వేసుకోవద్దని, పోలీసులు చెక్ చేస్తే స్వాధీనం చేసుకుంటారని, బంగారు గొలుసు తీసి జేబులో వేసుకోవాలని సలహా ఇచ్చారు. నమ్మిన చంద్రమౌళి గొలుసును మెడలో నుంచి తీసే సమయంలో సహకరిస్తున్నట్లు చేసిన సదరు వ్యక్తులు పేపర్‌లో చుట్టి చంద్రమౌళి జేబులో వేశారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిన చంద్రమౌళి జేబులో ఉన్న పేపర్ మూటను విప్పి చూడగా, బంగారు గొలుసుకు బదులు మట్టిరాళ్లు ఉన్నాయి. దీంతో మోసపోయానని గ్రహించిన చంద్రమౌళి జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, మెట్‌పల్లికి చెందిన మంగారాణి బీర్‌పూర్‌లో బంధువుల వివాహానికి వెళ్లింది. వివాహం పూర్తయిన తర్వాత నగలను తీసి హ్యాండ్ బ్యాగులో భద్రపరుచుకుని, తల్లి, కూతురుతో సహా ముగ్గురు కలిసి బీర్‌పూర్ నుంచి జగిత్యాలకు ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జగిత్యాల బస్టాండ్‌లో మెట్‌పెల్లి బస్సు కోసం వేచిచూస్తున్నారు. ఈ క్రమంలో బ్యాగు లోపల చూడగా, అందులో దాచిన 15 తులాల బంగారు నగలు కనబడలేదు. కాగా, ఆర్టీసీ బస్సులో బ్యాగులోని నగలను దొంగలు చోరీ చేసినట్లు వాపోయింది. విషయం తెలుసుకున్న జగిత్యాల టౌన్ పోలీసులు బస్టాండ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలించి బాధిత మహిళ నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. విచారణ చేస్తున్నామని టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

నేడు బీఆర్ఎస్ రైతు దీక్ష

జగిత్యాల/మెట్‌పల్లి, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా వరికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతు దీక్ష నిర్వహిస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం, తహసీల్ చౌరస్తా వద్ద రైతు దీక్ష నిర్వహిస్తున్నామని, నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కాగా, బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రైతు దీక్ష చేపడుతున్నట్లు ఆ పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం జరిగే ఈ మహాధర్నాలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొంటారన్నారు.

వాగులో పడి వలస కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: ప్రమాదవశాత్తు వాగులో పడి ఓ వలస కార్మికుడు మృతి చెందిన ఘటన మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన పూజారి శ్రీనివాస్(30) చౌలమద్ది పెద్దవాగుపై జరుగుతున్న వంతెన పనులు చేసేందుకు వలస వచ్చాడు. శుక్రవారం వాగు వద్ద స్నానం చేస్తుండగా, ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. కాగా, పోలీసులు మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బంగారు గొలుసు చోరీ నిందితుల అరెస్టు

కథలాపూర్, ఏప్రిల్ 5: రాజారాం తండాలో వృద్ధురాలు అపావత్ బిక్కి మెడలో నుంచి అరతులం బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్లలోని అల్లమయ్యగుట్ట ప్రాంతానికి చెందిన సదుల నరేశ్, కడమంచి ప్రశాంత్ ఈనెల 4న రాత్రి బైక్‌పై రాజారాం తండాకు వచ్చారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలు బిక్కి మెడలో నుంచి అర తులం బంగారు గొలుసును లాక్కెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చేపట్టారు. శుక్రవారం ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. సదుల నరేశ్, నడమంచి ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఎల్‌వోసీ అందించిన ప్రభుత్వ విప్

పెగడపల్లి, ఏప్రిల్ 5: పెగడపల్లి మండలం వెంగళాయి పేటకు చెందిన ఐతరవేని పోచయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్సనిమిత్తం ఆర్థిక సాయం కోసం ఆయన కుటుంబసభ్యులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను సంప్రదించారు. స్పందించిన ప్రభుత్వ విప్ చికిత్స నిమిత్తం, పోచయ్యకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేసి శుక్రవారం బాధితుడి కుమారుడు గంగాధర్‌కు అందించాడు. కాగా మండలానికి చెందిన పలువురికి ఇప్పటివరకు రూ.6.80 లక్షల విలువ చేసే ఎల్‌వోసీలను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మంజూరు చేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ తెలిపారు.

ప్రమాదకర బోరింగ్ తొలగింపు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

బోరింగ్ తొలగించిన దృశ్యం

పెగడపల్లి, ఏప్రిల్ 5: బతికపల్లికి నుంచి లింగాపూర్‌కు వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న బోరింగ్‌ను శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈనెల 1న 'ప్రమాదకరంగా బోరింగ్' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బోరింగ్‌ను తొలగించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.7.50 లక్షల పట్టివేత

పెగడపల్లి, ఏప్రిల్ 5: వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు మండలకేంద్రంలో శుక్రవారం రూ.7.50 లక్షల నగదును పట్టుకున్నారు. ఎస్ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సత్తయ్య, సిబ్బంది పెగడపల్లి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని రాంబద్రునిపల్లికి చెందిన పల్లె గంగారెడ్డి బైక్‌పై రూ.7.50 లక్షల నగదును తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా ఎన్నికల అధికారికి పంపించినట్లు ఏఎస్ఐ సతీశ్ తెలిపారు.

పశు పక్ష్యాదుల కోసం నీటి తొట్టీల ఏర్పాటు

వినూత్న కార్యక్రమానికి కోరుట్ల బల్దియా శ్రీకారం

డివైడర్ల మధ్యలో పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీటి కుండ

కోరుట్ల, ఏప్రిల్ 5: కోరుట్ల బల్దియా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూగజీవాలైన పశు, పక్ష్యాదుల కోసం నీటి తొట్టీలను ఏర్పాటు చేసి శభాష్ అనిపించుకుంటున్నది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పశువులు, పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి కుండీలను అధికారులు నెలకొల్పారు. జాతీయ రహదారి పొడవున డివైడర్ల మధ్యలో చిన్న చిన్న మట్టి చిప్పలు, కుండల్లో నీటిని నింపి పక్షులు దాహం తీర్చుకునే ఏర్పాట్లు చేశారు. స్థానిక కల్లూరు రోడ్డు, అయిలాపూర్ రోడ్డు, వేములవాడ రోడ్డు, మెట్‌పల్లి రోడ్డులో పశువుల కోసం సిమెంట్ కుండీల్లో నీటిని నింపి అందుబాటులో ఉంచారు.

ఉద్యమకారుడి కుటుంబానికి కొప్పుల పరామర్శ

చందు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, ఏప్రిల్ 5: తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, వెల్గటూర్ ఉమ్మడి మండలంలో యువతకు ఆదర్శంగా నిలిచి, తెలంగాణలో రెండో అమర వీరుల స్తూప నిర్మాణ కమిటీ చైర్మన్‌గా ఉన్న ఉపాధ్యాయుడు లింగంపల్లి చందు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఎండపల్లి మండలం గొడిసెలపేటకు చెందిన గొర్రె గట్టయ్య కూతురు వివాహానికి బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కరాటే సర్టిఫికెట్ల ప్రదానం

కరాటే శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 5: జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఎస్ఎం డీజీ స్కూల్‌లో ఒకినావ స్కూల్ ఆఫ్ కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, శిక్షకుడు తిరుమల నరేశ్, చీఫ్ ఎగ్జామినర్ మర్రిపెల్లి లింగయ్య, జిల్లా అధ్యక్షులు మర్రిపెల్లి శ్రీనివాస్, కాంతారావు, శ్రీనివాస చారి, బాపు, చందు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మారుతీనగర్, ఏప్రిల్ 5: మెట్‌పల్లి ఏకలవ్యనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహిస్తున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారుల కథనం ప్రకారం... మెట్‌పల్లి పట్టణంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం బాల్య వివాహం జరుగుతున్నట్లు అధికారులకు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో అధికారులు అక్కడికి చేరుకునే సరికి వివాహం నిర్వహించే నిర్వాహకులు వెళ్లిపోయారు. దీంతో అధికారులు గంటపాటు అక్కడే వేచి చూసి, వివాహానికి సంబంధించిన వారి వివరాలను సేకరించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిప్పంటుకుని ఇల్లు దగ్ధం

మేడిపల్లి, ఏప్రిల్ 5: మాచాపూర్‌కు చెందిన భైరి రాజుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైనట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. ఇంట్లోని రూ.25 వేల నగదుతో పాటు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

'జ్యోతి' విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల, ఏప్రిల్ 5: సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ